ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 14 జూన్ 2024

అమ్మ క్యాంటీన్లకు
పూర్వ వైభవం?!

- రంగులతో భవనాల ముస్తాబు
- కార్పొరేషన్ ఆదేశాలు



పెరంబూర్, జూన్ 13: వివిధ లోపాలతో కునారిల్లిపోతున్న 'అమ్మ క్యాంటీన్'లకు పునర్వైభవం తీసుకురావాలని చెన్నై కార్పొరేషన్ భావిస్తోంది. ఇప్పటికే అమ్మక్యాంటీన్లకు చెందిన భవనాలు శిథిలావస్థకు చేరుకోగా, అక్కడ తాగునీటి కొరత, ఆహార నాణ్యత తదితరాలతో వినియోగదారుల సంఖ్య కూడా రోజురోజుకు తగ్గిపోతోంది. దీంతో క్యాంటీన్ భవనాలకు మరమ్మతులు చేపట్టడంతోపాటు రుచికరమైన పదార్థాలు అందించాలని కార్పొరేషన్ నిర్ణయించింది. ఆ ప్రకారం, నగరంలో ఉన్న 391 అమ్మ క్యాంటీన్ భవనాలకు మరమ్మతులు చేపట్టి, రంగులు దిద్దే పనులు ప్రారంభమయ్యాయి. పేదలకు తక్కువ ధరలో, రుచికమైన ఆహారం అందించేలా దివంగత ముఖ్యమంత్రి జయలలిత 2013లో 'అమ్మ' క్యాంటీన్లు ప్రారంభించారు. చెన్నై కార్పొరేషన్‌లో ప్రభుత్వాసుపత్రి, వార్డుకు ఒకటి చొప్పున మొత్తం 207 క్యాంటీన్లు ప్రారంభించారు. ఈ క్యాంటీన్లకు ప్రజాదరణ పెరగడంతో 2016లో వార్డుకు రెండు చొప్పున 407 క్యాంటీన్లు ఏర్పాటుచేశారు. కోర్టుల్లో కేసులు, మెట్రోరైలు పనుల కారణంగా 16 క్యాంటీన్లు మూతపడగా, ప్రస్తుతం 391 క్యాంటీన్లు పనిచేస్తున్నాయి.

ఆదాయం రూ.20 కోట్లు... ఖర్చు రూ.140 కోట్లు...

ఈ క్యాంటీన్లలో ఇడ్లీ రూపాయి, పొంగల్, సాంబారన్నం, లెమన్ రైస్, కరివేపాకు అన్నం తలా ఐదు రూపాయలు, పెరుగన్నం మూడు రూపాయలు, రెండు చపాతీలు మూడు రూపాయలకు విక్రయిస్తున్నారు. తక్కువ ధర కావడంతో రోజువారీ కార్మికులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఈ క్యాంటీన్లను ఆశ్రయిస్తున్నారు. ఈ క్యాంటీన్ల ద్వారా రోజుకు రూ.5 లక్షల చొప్పున ఏడాదికి రూ.20 కోట్లు ఆదాయం వస్తుండగా, తక్కువ ధరకు పదార్థాలు విక్రయిస్తుండడంతో ఏడాదికి రూ.140 కోట్లు ఖర్చవుతోంది. ఆ ప్రకారం, ప్రతి ఏటా రూ.120 కోట్ల నష్టాల్లో ఈ క్యాంటీన్లు నడుస్తున్నాయి. ఈ నష్టాలు భర్తీచేసేలా ఎలాంటి చర్యలు చేపట్టకపోగా, అన్ని క్యాంటీన్లలో రుచి పడిపోవడంతో ఇక్కడకు వచ్చే ప్రజల సంఖ్య క్రమంగా తగ్గింది. పదార్థాల తయారీకి వినియోగించే సరుకులు, కూరగాయల కొనుగోళ్లలో అవినీతి చోటుచేసుకుంటోందని, ఇడ్లీ, చపాతి తదితరాలు రోడ్డుపక్కనున్న హోటళ్లకు అదనపు ధరకు సిబ్బంది విక్రయిస్తున్నారని ఆరోపణలున్నాయి. అదే సమయంలో నష్టాలను చూపి ఈ క్యాంటీన్లు మూసివేసేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోందని వార్తలు వెలువడ్డాయి. నష్టాన్ని భర్తీచేసేలా 'నమక్కు నామే' పథకంలో ప్రైవేటుకు భాగస్వామ్యంతో ఈ క్యాంటీన్లు నడపాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, భోజన పదార్థాలు మార్పుదంతో పాటు రుచికర భోజనం అందించాలని వారు కోరుతున్నారు.

క్యాంటీన్ల పునరుద్ధరణ...

దెబ్బతిన్న గోడల మధ్య పనిచేస్తున్న క్యాంటీన్లకు మరమ్మతులు చేపట్టి, వాటికి రంగులు వేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్యాంటీన్లకు ఫ్రిజ్, గ్రైండర్, మిక్సీ తదితరాలు సమకూర్చాలని మండల అధికారులకు కార్పొరేషన్ సర్క్యులర్ జారీ చేసింది. రాబోయే కాలంలో అమ్మ క్యాంటీన్లకు సంబంధించి ఫిర్యాదులొచ్చినా, కార్పొరేషన్‌కు చెడ్డ పేరు తీసుకొస్తే, సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని సర్క్యులర్‌లో హెచ్చరించారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ... అమ్మ క్యాంటీన్లను మూసే ఉద్దేశం లేదన్నారు. ఈ క్యాంటీన్లు పైకప్పు పెచ్చులూడడం, తాగునీటి కొరత, పదార్థాల్లో నాణ్యత, రుచి లోపించడం జరుగుతోందని కౌన్సిలర్ల స్టాండింగ్ కమిటీలో పలువురు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ క్యాంటీన్లను అధికారులు తనిఖీ చేసిన సమయంలో ప్రారంభించే సమయంలో వచ్చినంతగా ప్రజలు రావడం లేదని తెలిసిందన్నారు. దీంతో, అన్ని అమ్మ క్యాంటీన్లకు మరమ్మతులు చేపట్టి, రంగులు వేసి సరికొత్త శోభ సంతరించుకొనేలా పనులు చేపట్టాలని, ప్రజలు అధిక సంఖ్యలో క్యాంటీన్లకు వచ్చేలా, రుచికరమైన సరికొత్త వంటకాలు పరిచయం చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

స్వయంగా తనిఖీలు చేపట్టాలి...

అన్ని అమ్మ క్యాంటీన్లకు రంగులు వేసే పనులు సత్వరం చేపట్టాలని, అందుకు అవసరమైన నిధులను తగిన శాఖల ఉన్నతాధికారులను సంప్రదించి పొందవచ్చని కార్పొరేషన్ స్పష్టం చేసింది. ప్రతి అమ్మ క్యాంటీన్‌ను ఆరోగ్య, ఇంజనీర్, విద్యుత్ శాఖ అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలని, గోడలు, విద్యుత్ సాధనాలు దెబ్బతినడం, నీరు, డ్రైనేజీ సమస్యలను గుర్తించి వెంటనే సరిచేసేలా చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ ఉత్తర్వులు జారీచేసింది.



కువైట్ అగ్ని ప్రమాదంలో మృతిచెందిన కార్మికులు రిచర్డ్ - చిన్నదురై - మారియప్పన్ - మహమ్మద్ షరీఫ్

కువైట్ అగ్నిప్రమాదంలో ఐదుగురు తమిళ కార్మికుల మృతి

- త్వరలో స్వస్థలాలకు మృతదేహాలు : సీఎం

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కువైట్‌లో ఎన్టీపీసీ చమురు సంస్థ కార్మికులు నివసిస్తున్న భవన సముదాయంలో సంభవించిన అగ్ని ప్రమాదం కారణంగా మృతిచెందిన వారిలో రాష్ట్రానికి చెందిన ఐదుగురు వున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కువైట్ సౌత్ అహ్మదీ ప్రావిన్స్‌లో మంగాఫ్ అనే ప్రాంతంలో ఉన్న ఆ నాలుగంతస్థుల భవన సముదాయంలో కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు 195 మంది దాకా నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజాము ఆ భవన సముదాయంలోని ఓ ఇంటిలోని వారు వంట చేస్తుండగా నిప్పుమంటలు చెలరేగి అన్ని ప్లాట్లకు వ్యాపించాయి. క్షణాల్లో దట్టమైన పొగలతో మంటలు భవనం పై అంతస్థు వరకూ వ్యాపించింది. అప్పటికే ప్లాట్లలో ఉన్నవారంతా నిద్రనుంచి ఉలిక్కిపడి లేచి ఏం జరుగుతున్నదో తెలుసుకునేలోపే మంటలలో చిక్కుకుని 53 మంది భారతీయులు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. వీరిలో కేరళకు చెందిన 14 మంది కూడా ఉన్నారు. ఇక రాష్ట్రానికి సంబంధించి ఐదుగురు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించారు. ఈ దుర్ఘటన గురించి తెలియగానే ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవాస తమిళుల సంక్షేమశాఖ మంత్రి సెంజి మస్తాన్, ఇతర అధికారులతో చర్చించారు. కువైట్ అగ్ని ప్రమాదంలో ఎంతమంది తమిళ కార్మికులు, ఉద్యోగులు మృతి చెందారనే వివరాలను ఆ దేశ రాయబార కార్యాలయం అధికారుల ద్వారా అడిగి తెలుసుకుని మృతదేహాలను వీలైనంత త్వరగా స్వస్థలాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ దుర్ఘటనలో రాష్ట్రానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందినట్లు కువైట్ ప్రభుత్వ ఉన్నతాధికారులు నిర్ధారించినట్లు స్టాలిన్ పేర్కొన్నారు. రామనాథపురం జిల్లా తెన్నవనూరుకు చెందిన రాముకరుప్పన్ దట్టమైన పొగల మధ్య చిక్కుకుని ఊపిరాడక మృతి చెందారు. ఇదే విధంగా విల్లుపురం జిల్లా సెంజి ప్రాంతానికి చెందిన మహమ్మద్ షరీఫ్, కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోవిల్ ప్రాంతానికి చెందిన చిన్నదురై అలియాస్ కృష్ణమూర్తి, పేరావూర్ని సమీపంలోని ఆదనూరు ప్రాంతానికి చెందిన రిచర్డ్ రాయ్ కోవిల్‌పట్టికి చెందిన వీరాసామి మారియప్పన్ మృతిచెందారు. ప్రస్తుతం ఈ ఐదుగురి మృతదేహాలను గుర్తించే పనులు జరుగుతున్నాయి. ఈ ప్రమాదం జరిగినప్పటి నుండి కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం ఉన్నతాధికారులు ప్రమాద స్థలానికి వెళ్ళి పరిశీలన జరుపుతున్నారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. అగ్ని ప్రమాదం జరిగిన భవనసముదాయంలో బసచేసినవారి వివరాలు తెలుసుకునేందుకు అక్కడి భారత రాయబార అధికారులు 965-65505246 అనే హెల్ప్‌లైన్ నెంబర్‌ను కూడా ప్రకటించారు. ఈ విషయమై మంత్రి సెంజి మస్తాన్ మాట్లాడుతూ కువైట్ అగ్ని ప్రమాదంలో మృతి చెందిన తమిళుల మృతదేహాలను స్వస్థలానికి తరలించేందుకు భారత రాయబార కార్యాలయం అధికారులతో చర్చలు జరుపుతున్నామని, వీలయినంత త్వరగా మృతదేహాలను తీసుకువస్తామన్నారు.

సీఎం, గవర్నర్ సంతాపం...

కువైట్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు సహా మొత్తం 53 మంది భారతీయ కార్మికులు దుర్మరణం చెందటం పట్ల గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంతాపం వ్యక్తం చేస్తూ వేర్వేరు ప్రకటనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన ప్రకటనలో కువైట్ అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తమిళ కార్మికుల మృతదేహాలను త్వరగా స్వస్థలాలకు తరలించేందుకు భారత రాయబార కార్యాలయం అధికారుల ద్వారా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే విధంగా ఎండీఎంకే నేత వైగో, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్ తదితరులు సంతాపం వ్యక్తం చేస్తూ ప్రకటనలు జారీ చేశారు.



కొత్త బస్సు సేవలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి శివశంకర్

ఆ బస్సులు రాష్ట్రంలో
రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే

- రవాణాశాఖ మంత్రి శివశంకర్

ప్యారీస్, జూన్ 13: పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబరు కలిగిన ఆమ్నీ బస్సులు తమిళనాడులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందేనని, ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశామని రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకలను పురస్కరించుకొని స్థానిక అన్నాసాలైలో ఉన్న పల్లవన్ హౌస్ ప్రాంగణంలో రవాణా శాఖలో కొత్త బస్సు సేవలను గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం రవాణా శాఖలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగుల వారసులు 49 మందికి డ్రైవర్, కండక్టర్ ఉద్యోగాలను కారుణ్య ప్రాదిపదికన నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రవాణా శాఖలో పనిచేస్తూ సర్వీసులో మృతిచెందిన 57 మంది ఉద్యోగుల వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించామని, ఇప్పటివరకు మొత్తం 106 మంది వారసులు ఉద్యోగ అవకాశాలు పొందారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20,000లకు పైగా డీజిల్ బస్సులు నడుపుతున్నామని, వీటిలో 1.76 కోట్ల మందికి పైగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. రవాణా శాఖ ఖర్చుల్లో 27 శాతం నిధులను ఇంధనం కోసం కేటాయిస్తున్నామని, ఈ ఆర్థిక భారాన్ని తగ్గించేలా, పర్యావరణంలో ఏర్పడే కాలుష్యాన్ని నివారిస్తూ 14 సీఎన్జీ, రెండు ఎల్ఎన్జీ బస్సులను డిజైన్ చేయించామని, తొలివిడతగా ఈ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రాబోయే రోజుల్లో రవాణా సంస్థలు నడిపే అన్ని బస్సులను దశలవారీగా డీజిల్‌కు బదులుగా గ్యాస్‌తో నడిపేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 2 వేల కొత్త బస్సులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కేటాయించిన నిధుల నుంచి ప్రస్తుతం 1,000 పసుపు రంగు బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. జర్మన్ నిధుల సహకారంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అదనంగా మరో 3 వేల బస్సులు ఆధునిక వసతులతో తయారవుతున్నాయన్నారు. పండుగలు, వారాంతపు సెలవు రోజుల్లో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా అదనపు బస్సులు నడుపుతామని, అదే సమయంలో ప్రయాణికుల రద్దీ ఉన్నట్లయితే అదనంగా మరికొన్ని బస్సులు కూడా నడుపుతామన్నారు. రాష్ట్రంలో వేల సంఖ్యలో ప్రైవేటు ఆమ్నీ బస్సులు నడుపుతున్నారని, వీటిలో పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబర్లు కలిగిన 547 బస్సుల యజమానులు తమిళనాడులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి ఫణీంధర్ రెడ్డి, ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీ జాన్ వర్గీస్, ఎంపీ షణ్ముగం, ఉన్నతాధికారులు, రవాణా కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విక్రవాండిలో నేటి నుంచి
నామినేషన్ల స్వీకరణ



చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఘట్టం శుక్రవారం ప్రారంభం కానుంది. విక్రవాండి డీఎంకే శాసనసభ్యుడు పుగళేంది గత ఏప్రిల్ ఆరున అనారోగ్యం కారణంగా మృతి చెందటంతో ఆ నియోజకవర్గానికి జూలై 10న ఉప ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. పాలకపక్షం డీఎంకే తరఫున ఆ నియోజకవర్గంలో పార్టీ రైతు కార్మికుల విభాగం కార్యదర్శి అన్నియూరు శివా పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆ నియోజకవర్గం ఉప ఎన్నికల నామినేషన్ల స్వీకరణ శుక్రవారం ప్రారంభమవుతోంది. ఈ నెల 21వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 24న నామినేషన్ల పరిశీలన జరుగనుంది. 24 సాయంత్రంలోగా నామినేషన్లను ఉపసంహరించుకోవాల్సి ఉంటుందని ఎన్నికల నిర్వహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు విక్రవాండి తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు.

అన్నాడీఎంకే అభ్యర్థి ఎంపికలో ప్రతిష్టంభన...

విక్రవాండి ఉప ఎన్నికల్లో పార్టీ తరఫున అభ్యర్థిని ఎంపిక చేయడానికి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మల్లగుల్లాలు పడుతున్నారు. పోటీ చేయడానికి ఏడుగురు అభ్యర్థులు ఆసక్తి కనబరుస్తుండటంతో అభ్యర్థి ఎంపికలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. 2019లో విక్రవాండిలో పోటీ చేసి గెలిచిన మాజీ శాసనసభ్యుడు ముత్తమిళ్ సెల్వన్ మళ్ళీ ఆ చోట పోటీ చేయడానికి పార్టీ అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ముత్తమిళ్ సెల్వన్ పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇదే విధంగా కానై ప్రాంతానికి చెందిన పార్టీ కార్యదర్శి రాజా, విక్రవాండి యూనియన్ కార్యదర్శులు పన్నీర్, ముకుందన్, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి లక్ష్మీనారాయణన్, పారిశ్రామికవేత్త టీకే సుబ్బరాయన్, విక్రవాండి పార్టీ నగర శాఖ కార్యదర్శి పూర్ణరావు పోటీ చేయడానికి దరఖాస్తులు పెట్టుకున్నారు. వీరిలో ఎవరిని ఎంపిక చేయాలనే విషయంపై పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సీనియర్లతో చర్చలు జరపాలని నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల్లో అన్ని చోట్లా పరాజయం చవిచూసిన అన్నాడీఎంకే విక్రవాండి ఉపఎన్నికల్లో తన సత్తాను చూపేందుకు అనువుగా ఆర్థిక బలం, అంగబలం కలిగిన అభ్యర్థిని పోటీలో దింపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

చంద్రబాబును కలిసిన ఎస్ఆర్ఎం కులపతి

మంగళగిరి, జూన్ 13: ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కులపతి, పార్లమెంటు మాజీ సభ్యుడు డాక్టర్ టీఆర్ పారివేందర్, వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ పి.సత్యనారాయణన్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఉండవల్లిలోని నివాసంలో కలుసుకున్నారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తుందని, ప్రజల సంక్షేమానికి ప్రణాళికాబద్ధమైన పాలన అందించాలని పారివేందర్ ఆకాంక్షించారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని సత్యనారాయణన్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు అమరావతి పునర్నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని, ఎస్ఆర్ఎం వర్సిటీకి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పారివేందర్, సత్యనారాయణన్

బోధనేతర సిబ్బంది
వేతనం పెంపు

పెరంబూర్, జూన్ 13: రాష్ట్రంలోని 44 వెనుకబడిన యూనియన్లలో పనిచేస్తున్న మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న 308 మంది బోధనేతర సిబ్బందికి వేతనాలు పెంచుతూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. జూనియర్ అసిస్టెంట్, లైబ్రేరియన్, లేబొరేటరి అసిస్టెంట్ పోస్టులకు అందిస్తున్న ప్రోత్సాహక వేతనం రూ.6 వేల నుంచి రూ.12 వేలు, ఆఫీస్ అసిస్టెంట్, క్లీనర్, వాచ్‌మెన్, గార్డనర్ పోస్టులకు రూ.4,500 నుంచి రూ.10 వేలకు పెంచారు. ఈ పెంపుతో ప్రభుత్వానికి రూ.2.11 కోట్ల అదనపు భారం పడనుందని విద్యాశాఖ తెలిపింది. కాగా, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి 10 ఏళ్ల అనంతరం వేతనం పెంచడం గమనార్హం.

విద్య, ఉద్యోగావకాశాల్లో
హిజ్రాలకు ప్రత్యేక కేటగిరి

రాష్ట్రప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఆదేశం



ప్యారీస్, జూన్ 13: విద్య, ఉద్యోగావకాశాల్లో హిజ్రాలను ప్రత్యేక కేటగిరీకి చెందిన వారుగా రాష్ట్రప్రభుత్వం గుర్తించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. గత 2017-18వ సంవత్సరం తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2ఏ పరీక్షల్లో పాల్గొన్న అనుశ్రీ అనే హిజ్రా సర్టిఫికేట్ల పరిశీలనకు తనను అనుమతించేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. గురువారం ఈ కేసును విచారించిన న్యాయమూర్తి భవాని సుబ్బరాయన్... హిజ్రాలను సమాజంలో పౌరులుగా చూడాలని, వారికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ రాయితీ కల్పించాలని సుప్రీంకోర్టు 2014లో వెలువరించిన తీర్పును గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇప్పటివరకు ఈ ఉత్తర్వులు సక్రమంగా అమలుచేయలేదని వ్యాఖ్యానించారు. హిజ్రాలను పురుషులుగానో, మహిళలుగానో భావించకుండా ప్రత్యేక కేటగిరీకి చెందిన వారుగా చూడాలని ఆదేశించారు. పిటిషనర్ అనుశ్రీ సర్టిఫికేట్లను ప్రభుత్వం పరిశీలించాలని ఉత్తర్వులు జారీచేశారు.

సమాచార దృశ్యని

'విలేజ్ సైంటిస్ట్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 13: తమిళనాడు సైన్స్ సిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా గ్రామాల్లో నివసించే శాస్త్రవేత్తల ఆవిష్కరణలు గుర్తించి, వారికి 'విలేజ్ సైంటిస్ట్' పురస్కారం అందజేస్తున్నారు. సమాజానికి పనిచేసే రెండు ఉత్తమ ఆవిష్కరణలకు ఈ పురస్కారాలు అందజేయనున్నారు. పురస్కార గ్రహీతలకు తలా రూ.లక్ష నగదు, సర్టిఫికేట్ అందజేస్తారు. అర్హులైన వారు www.sciencecitychennai.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి ఆగస్టు 31వ తేదిలోపు పంపించాలని అధికారులు తెలిపారు.

కిలో పచ్చి మిర్చి రూ.100

ఐసిఎఫ్, జూన్ 13: స్థానిక కోయంబేడు మార్కెట్లో కిలో పచ్చి మిర్చి రూ.100కు విక్రయమవుతున్నాయి. రాష్ట్రంలో కొన్నిరోజులుగా టమోటా, చిన్న ఉల్లి ధరలు పెరుగుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో, వేసవి వర్షాలతో పంటలు ధ్వంసం కావడంతో పచ్చి మిర్చి ధరలు పెరిగాయి. గత వారం రూ90కి విక్రయమైన పచ్చి మిర్చి, బుధవారం రూ.100కు చేరుకుంది. ఇదేవిధంగా, మునక్కాయలు, కొత్తిమీర ఇతర కూరగాయల ధరలు కూడా పెరిగాయి.

మానసిక వికలాంగులకు ఉచిత విద్య

ఐసిఎఫ్, జూన్ 13: బుద్ధిమాంద్య కలిగిన పిల్లలకు ఉచిత విద్య అందించనున్నట్లు దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ లక్ష్మి తెలిపారు. ఒక్కో జిల్లాలో ఇలాంటి పిల్లలకు ప్రత్యేక పాఠశాలలున్నాయి. వీటిలో 104 పాఠశాలలు హాస్టల్ సదుపాయంతో పనిచేస్తున్నాయి. సమన్వయ పాఠశాల విద్య ద్వారా 430 డే టైమ్ పర్యవేక్షణ కేంద్రాలు కూడా పనిచేస్తున్నాయి. బుద్ధిమాంద్య కలిగిన పిల్లలను తల్లిదండ్రులు, పర్యవేక్షకులు తమ సమీపంలో ఉన్న ప్రత్యేక పాఠశాలలో చేర్పించాలని కోరారు.

విద్యాశాఖ అధికారుల నియామకం

ఐసిఎఫ్, జూన్ 13: కళాశాల విద్య డైరెక్టరేట్ పనులకు కొత్త జాయింట్ డైరెక్టర్లను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కార్తీక్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, కళాశాల విద్య ప్రణాళిక విభాగానికి ఆర్.రావణన్, నిధుల విభాగానికి రామన్, చెన్నై మండలానికి సుధర్‌కొడి, తంజావూరు మండలానికి రోసి, వేలూరు మండలానికి మలర్, తిరునల్వేలి మండలానికి రవీంద్రన్‌లు నియమితులయ్యారు.

రేపటి నుంచి 2,005 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూన్ 13: శుభముహూర్తాలు, వారాంతపు సెలవులు, బక్రీద్ పండుగ సందర్భంగా 2,005 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. ఈ విషయమై ఎంటీసీ విడుదల చేసిన ప్రకటనలో, కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 545, శనివారం 585, ఆదివారం 140 ప్రత్యేక బస్సులు నడుపనున్నామని తెలిపింది. అలాగే, సోమవారం స్వగ్రామాల నుంచి చెన్నైకి వచ్చే వారి సౌకర్యార్థం 705 ప్రత్యేక బస్సులు నడుపున్నామని తెలిపింది. కోయంబేడు నుంచి తిరువణ్ణామలకు శుక్ర, శనివారాల్లో తలా 15 బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

ఆన్‌లైన్‌లో పాల కార్డులు

ఐసిఎఫ్, జూన్ 13: వినియోగదారులు ఇకపై ఆన్‌లైన్‌లో పాల కార్డులు పొందవచ్చని ఆవిన్ సంస్థ తెలిపింది. వినియోగదారులకు పాలను ఆవిన్ సంస్థ తక్కువ ధరకు విక్రయిస్తోంది. అవసరమయ్యే పాల రకాలను రాయితీ ధరకు కొనుగోలు చేసేవారు ఆయా ప్రాంతాల్లో ఆవిన్ సంస్థ కార్యాలయాలకు వెళ్లి www.aavin.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకొని పాలు పొందుతున్నారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా వినియోగదారులు తమ ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో పాల కార్డులు పొందే సదుపాయాన్ని కల్పించారు.

10.14 కోట్ల పర్యాటకుల రాక

ఐసిఎఫ్, జూన్ 13: రాష్ట్రానికి ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 10,14,94,849 మంది ఇతర రాష్ట్ర పర్యాటకులు వచ్చినట్లు మంత్రి రామచంద్రన్ తెలిపారు. స్థానిక వాలాజా రోడ్డులో ఉన్న పర్యాటక శాఖ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... కరోనా అనంతరం 2021లో 57,622గా ఉన్న విదేశీ పర్యాటకుల సంఖ్య 2022లో 4,07,139గాను, 2023లో 11,74,899గాను పెరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 4,97,437 మంది విదేశీ పర్యాటకులు, ఇతర రాష్ట్ర పర్యాటకుల సంఖ్య 2021లో 11,53,36,719 నుంచి 2022లో 21,85,84,846కు పెరిగిందన్నారు. 2023లో ఈ సంఖ్య 28,60,11,515కు చేరుకుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి జనవరి నుంచి ఏప్రిల్ వరకు 10,14,94,849 మంది స్వదేశీ పర్యాటకులు వచ్చారని మంత్రి తెలిపారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

పెరంబూర్, జూన్ 13: తూత్తుకుడిలో గురువారం వాహనచోదకులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ బాలాజి శరవణన్ పలురు వాహనచోదకులకు ఉచితంగా హెల్మెట్ అందజేశారు. ప్రమాదాల సమయంలో హెల్మెట్ ధారణ సురక్షితమని, ప్రాణాలు కాపాడేందుకు ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ బాలురు వాహనాలు నడపడం తదితరాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి అందరూ సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

'ఔత్సాహిక పారిశ్రామికవేత్త' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 13: మెడ్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, కెవిన్‌కేర్ సంస్థ సంయుక్తంగా ప్రతిభావంతులైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 'చిన్నికృష్ణన్ ఇన్నోవేషన్ అవార్డు 2024' పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. గత 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్లలోపు ఆదాయం ఆర్జించిన చిన్న, మధ్యతరహా సంస్థలు, స్టార్టప్ సంస్థలు ఈ పురస్కారానికి https://ckinnovationawards.in అనే వెబ్‌సైట్‌లో జూలై 8వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. అవార్డు గ్రహీతలకు రూ.1 లక్ష నగదు బహుమతి అందజేయనున్నారు. ఇతర వివరాలకు 9789960398 అనే నెంబరుకు మిస్డ్ కాల్ ఇచ్చి వివరాలు పొందవచ్చు.

18 నుంచి కీళడిలో పురావస్తు తవ్వకాలు ప్రారంభం

పెరంబూర్, జూన్ 13: శివగంగ జిల్లా కీళడిలో 10వ విడత పురావస్తు తవ్వకాలు ఈ నెల 18వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పనులను సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారు. కీళడి, వెంబకోట, గంగైకొండాన్ చోళవరం సహా 8 ప్రాంతాల్లో పురావస్తు తవ్వకాలు ప్రారంభమవుతాయని సచివాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.



చెన్నై క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కుమార్‌జయంత్ సతీమణి రిచీప్రీతం రచించిన 'యాన్సియంట్ జైన్ లెజెన్సీ ఆఫ్ తమిళనాడు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముస్లిం అభివృద్ధికి పథకాలు అమలుచేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను గురువారం మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి సెంజి మస్తాన్ నేతృత్వంలో కలుసుకొని కృతజ్ఞతలు తెలుపుతున్న యునైటెడ్ జమాత్ ఫెడరేషన్ ఆఫ్ తమిళనాడు మసీదు నిర్వాహకులు



చెన్నై గిండీలోని రాజ్‌భవన్‌లో గురువారం గవర్నర్ ఆర్ఎన్ రవితో భేటీ అయిన మలేసియా కౌన్సిల్ జనరల్, చెన్నై శరవణ కుమార్ కుమారవాసగం తదితరులు

సహకార విక్రయ కేంద్రాలు అదుర్స్!

రూ.6892 కోట్లకు విక్రయాలు ● రూ.450 కోట్ల విలువ చేసే మందులు కూడా ● ప్రభుత్వ ప్రకటన

అడయార్, జూన్ 13: ఎంకే స్టాలిన్ ప్రభుత్వంలో సహకార సంఘాల విక్రయ కేంద్రాల పనితీరు అద్భుతంగా ఉందని, ఈ కేంద్రాల ద్వారా రూ.6,892 కోట్ల మేరకు విక్రయాలు జరిగాయని ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యంగా మందుల షాపుల ద్వారా రూ.450 కోట్ల విలువ చేసే మందులను విక్రయించినట్టు తెలిపింది. ఈ ప్రభుత్వ ప్రకటనలో పేర్కొన్న సారాంశాన్ని పరిశీలిస్తే... గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఒక కుటుంబానికి 5 సవర్లలోపు ఉన్న బంగారు రుణాలు లేదా రూ.6 వేలలోపు ఉన్న రుణాలను మాఫీ చేయాలని గత 2021 మార్చి 31వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఆదేశాల మేరకు 13,12,717 మంది లబ్ధిదారులకు రూ.4,818.88 కోట్ల మేరకు సహకార రుణాలను మాఫీ చేశారు. సహకార సంఘాల ద్వారా స్వయం సహాయక మహిళా బృందాలు తీసుకున్న రుణాల్లో రూ.2,755.99 కోట్లను మాఫీ చేశారు. ఈ నిర్ణయం ద్వారా 1,17,617 మహిళా బృందాలకు చెందిన 15,88,309 మంది లబ్ధి పొందారు. నిర్ణీత గడువులోగా రుణాలను చెల్లించిన రైతులకు లబ్ధి చేకూర్చేలా 2021 మే 7 తేదీ నుంచి 2023 డిసెంబరు 31వ తేదీ వరకు మూడేళ్ళ లోపు 46,72,849 మంది రైతులకు రూ.35,852.48 కోట్ల పంట రుణాలను అందించారు. 6,52,110 మంది వ్యవసాయదారులకు పశుసంవర్థక, దాని అనుబంధ విభాగాలకు పనులకు రూ.3,233.92 కోట్ల మేరకు రుణాలు మంజూర చేశారు. మహిళా స్వయం సహాయక బృందాలకు ఇచ్చే రుణాల గరిష్ట పరిమితిని రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. 115 వ్యవసాయ ఉత్పత్తి సహకార విక్రయ సంఘాల ద్వారా రూ.2,567.38 కోట్లకు వివిధ రకాల వ్యవసాయ పనిముట్లను అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న సహకార సంఘాల ద్వారా వివిధ రకాల వస్తు ఉత్పత్తుల విక్రయం రూ.6,892.22 కోట్ల మేరకు జరిగింది. సహకార మందుల షాపుల్లో రూ.450 కోట్ల విలువ చేసే మందులను విక్రయించారు. ఇలా మూడేళ్ళ కాలంలో వివిధ రకాల వస్తువుల విక్రయాలు గణనీయంగా పెరగడంతో ఈ సంఘాల పనితీరు అద్భుతంగా ఉందంటూ ప్రభుత్వం వివరించింది.

శ్రీలంకకు తరలిస్తున్న 2 టన్నుల అల్లం స్వాధీనం

పెరంబూర్, జూన్ 13: రామనాథపురం జిల్లా మండపం సమీపంలోని జాలర్ల గ్రామం మరైక్కాయర్ పట్టణంలో 60బస్తాల్లో దాచిన సుమారు 2 టన్నుల వంటకు వినియోగించే అల్లంను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సముద్రమార్గంగా శ్రీలంకకు అక్రమంగా అల్లం తరలిస్తున్నారని అధికారులు ప్రాథమిక విచారణలో తెలియడంతో, వాటిని తరలించే వారి కోసం విచారిస్తున్నారు.

తమిళ పాఠ్యపుస్తకంలో లోపాలు

ఐసిఎఫ్, జూన్ 13: టెన్త్ తమిళ పాఠ్యపుస్తకంలో తప్పులు దొర్లినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ పుస్తకంలో 'పన్ముఖ కలైంజర్' అనే పాఠ్యాంశం చోటుచేసుకుంది. అందులో కరుణానిధి మరణించిన తేది ఆగస్టు 7వ తేదీ బదులుగా జూలై 7వ తేది అని ముద్రితమైంది. దీని గురించి పాఠశాల విద్య డైరెక్టర్ అరివొళికి రాష్ట్ర ఉపాధ్యాయ విద్య, శిక్షణా సంస్థ డైరెక్టర్ లత పంపిన ఉత్తరంలో... పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠాలు బోధించేటప్పుడు కరుణానిధి మృతిచెందిన తేది సవరించి బోధించాలని, అదే విధంగా 9వ తరగతి సోషల్ సైన్స్‌లో తీగల్లేని సమాచార సాంకేతికతను కనుగొన్న వ్యక్తి మార్కోని అనడానికి బదులుగా థామస్ ఆల్వా ఎడిసన్ అని ముద్రితమైందని తెలిపారు. అలాగే, విద్యుత్ బల్బు కనుగొన్న వ్యక్తి థామస్ ఆల్వా ఎడిసన్ అనే బదులు మార్కోనిగా ఉందని, ఈ పొరపాట్లు సరిదిద్ది ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని కోరారు.

15 బోరుబావులకు సీలు

ఐసిఎఫ్, జూన్ 13: స్థానిక పూందమల్లిలో అనుమతి పొందకుండా పనిచేసిన 15 బోరుబావులకు రెవెన్యూ శాఖ అధికారులు సీలు వేశారు. పూందమల్లి తాలూకా పరిధిలోని పలు ప్రాంతాల్లో బోరుబావులు ఏర్పాటుచేసి ఆ నీటిని ట్యాంకర్ లారీల ద్వారా తరలించి విక్రయిస్తున్నట్లు తహసీల్దార్ గోవిందరాజన్ ఫిర్యాదులందాయి. ఆయన నేతృత్వంలో అధికారులు బుధవారం పూందమల్లి హైరోడ్డు, సెన్నీర్‌కుప్పం సహా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, అనుమతి లేని 15 బోరుబావులు గుర్తించారు. వాటికి అమర్చిన విద్యుత్ మోటారును తొలగించి సీలు వేశారు. నిబంధనలు ఉల్లంఘించిన బోర్ల యజమానులపై చట్టపరమైన చర్యలు చేపట్టనున్నామని అధికారులు తెలిపారు.

40 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఐసిఎఫ్, జూన్ 13: చెన్నై, ఆవడి, తాబరం కమిషనరేట్లలో 40 మంది పోలీస్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు. చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఈ నెల 8వ తేది జరిగిన పోలీస్ గ్రీవెన్స్‌లో డీజీపీ శంకర్ జివాల్ పోలీసుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిలో ఎక్కువగా బదిలీ కోరుతూ అందజేసిన వినతిపత్రాలున్నాయి. వాటిని పరిశీలించిన డీజీపీ, చెన్నై, ఆవడి, తాంబరం కమిషనరేట్లలో 40 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

తిరుత్తణిలో ఒకే రోజు 50 వివాహాలు

ఐసిఎఫ్, జూన్ 13: తిరుత్తణి మురుగన్ ఆలయంలో ఒకేరోజు 50 వివాహాలు జరిగాయి. ఆలయంలోని ఆర్సీ మండపంలో ఆలయ నిర్వాహకులు వివాహాలు జరిపించి, సర్టిఫికేట్లు అందజేస్తున్నారు. ఇందుకోసం ఈ మండపంలో పలు చోట్ల వివాహ వేదికలు ఏర్పాటుచేసి, ఒక్కో జంటకు కనిష్టంగా గంట సేపు కేటాయిస్తున్నారు. బుధవారం వివాహ శుభముహూర్తం కావడంతో కొండపై ఉన్న ఆలయంలో మాత్రమే 50 జంటలకు పెళ్లిళ్లు జరిగాయి. వివాహానికి వచ్చిన బంధువులు, మిత్రుల, సాధారణంగా వచ్చే భక్తులని వేలసంఖ్యలో రథ వీధిలో ఉన్న మూలవిరాట్టును దర్శించుకున్నారు. అంతేకాకుండా, తిరుత్తణి నగరంలో 35కు పైగా ప్రైవేటు కల్యాణ మండపాల్లో జరిగిన వివాహాలకు వచ్చిన వారు, కొత్త దంపతులు స్వామివారిని దర్శించుకోవడానిని కొండ ఆలయానికి వచ్చారు. దీంతో మూలవిరాట్టు దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది.

ఇద్దరు శ్రీలంక జాలర్ల అరెస్టు

చెన్నై, జూన్ 13 (ఆంధ్ర జిఠి 6జ్యోతి): నాగపట్టినం జిల్లా వేదారణ్యం సమీపంలో రెండు నాటికల్ మైళ్ల దూరం జిఠి 6లో చేపలు పడుతున్న ఇద్దరు శ్రీలంక జాలర్లను సముద్రతీర భద్రతాదళం పోలీసులు అరెస్టు చేశారు. గురువారం వేకువజాము వేదారణ్యం జాలర్ల నాటుపడవలలో చేపలవేట ముగించుకుని తిరిగి వస్తుండగా శ్రీలంక జాలర్లు ఇరువురు మరపడవలలో చేపలుపడుతుండటం గమనించారు. వెంటనే వేదారణ్యం జాలర్లు ఆ ఇరువురిని నిర్బంధించి తీరానికి చేర్చి సముద్రతీర భద్రతాదళం పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో ఆ ఇరువురూ శ్రీలంకలోని జాఫ్నాకు చెందిన విజయకుమార్, మైఖేల్ ఫెర్నాండో అని గుర్తించారు. భారత సముద్ర జలాల్లో అక్రమంగా చొరబడ్డారనే నేరంపై ఇరువురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రహదారిని కప్పేసిన ఇసుక మేటలు



చెన్నై, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళవేర్కాడు సమీపం కరుంగాళి సముద్ర తీర ప్రాంతం వద్ద గత రెండు రోజులుగా రాక్షస అలలు తీరం వైపు ఎగసిపడ్డాయి. దీనితో సముద్రతీరం వద్దనున్న అరడగు ఎత్తుకలిగిన రహదారి గోడను దాటుకుని అలలు దూసుకువచ్చాయి. అదే సమయంలో తీరంలో ఉన్న టన్నుల కొద్దీ ఇసుకను కూడా రహదారిపై పడేలా చేశాయి. కరుంగాళి రహదారి పూర్తిగా నాలుగు మీటర్ల ఎత్తువరకూ ఇసుకమేటలతో నిండిపోయాయి. దీనితో ఆ మార్గంలో గురువారం ఉదయం వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రస్తుతం రహదారిలోని ఇసుకమేటలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ధనుష్కోటి నుంచి కార్గిల్‌కు సైనికుల బైక్ ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న సైనికాధికారి శ్రీనివాస్

పెరంబూర్, జూన్ 13: కార్గిల్ యుద్ధ విజయానికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ధనుష్కోటి అరిచ్చల్‌మునై నుంచి కార్గిల్ వరకు 4,000 కి.మీ సైనికుల బైక్ ర్యాలీ బుధవారం ప్రారంభమైంది. 1999 మే 3 నుంచి 26వ తేది వరకు లడాఖ్ సమీపం కార్గిల్ కొండల్లో ప్రవేశించేందుకు యత్నించిన పాకిస్తాన్ మద్దతుదారులైన తీవ్రవాదులను అడ్డుకొన్న భారత్ సైన్యం, అప్పుడు జరిగిన పోరులో విజయం సాధించింది. ఈ విజయోత్సవ వేడుకలను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నిర్వహిస్తోంది. ఈ పోరుకు 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో, రామేశ్వరం సమీపం అరిచ్చల్‌మునై సముద్ర తీరం నుంచి కార్గిల్ వరకు 4 వేల కి.మీ దూరం ఏడుగురు భారత సైనికులు ర్యాలీ చేపట్టనున్నారు. దక్షిణ సైనిక ప్రధాన అధికారి మేజర్ జనరల్ ఆర్ఎం శ్రీనివాస్ ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మదురై, బెంగుళూరు, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, సర్సూ, నయోమా, లడాఖ్ మీదుగా జూలైలో కార్గిల్ చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

విక్రవాండి ఉప ఎన్నికలు

● రూ.20 లక్షల విలువైన వెండి గొలుసులు స్వాధీనం

ప్యారీస్, జూన్ 13: విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలో తగిన రసీదులు లేకుండా తరలించిన రూ.20 లక్షల విలువగల కాలి వెండి గొలుసులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక జూలై 10వ తేది జరుగనుంది. ఈ నియోజకవర్గంలో మూడు రోజుల నుంచే ఎన్నికల నియామవళి అమలుకు వచ్చింది. ఈ నేపథ్యంలో, విక్రవాండి సమీపంలోని మేల్‌కొంద రహదారిలో ఉన్న ఫ్లై ఓవర్ సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం ఉదయం వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు. అప్పుడు ఆ మార్గంలో వెళ్లిన కారును ఆపి తనిఖీ చేశారు. అందులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలించిన రూ.20 లక్షలు విలువైన 23.234 గ్రాముల కాలి వెండి గొలుసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... విక్రవాండికి చెందిన కవియరసన్ అనే వ్యాపారి జువెలరీ షాపులకు సరఫరా చేసేందుకు వాటిని తరలించినట్లు తెలిసింది. ఈ గొలుసులను ఎన్నికల అధికారి, తహసీల్దార్ యువరాజ్ వద్ద అప్పగించారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతికలోపం

ప్యారీస్, జూన్ 13: చెన్నై-సింగపూర్ మధ్య నడిపే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో హఠాత్తుగా సాంకేతికలోపం ఏర్పడిన కారణంగా ఆ విమానం ఐదు గంటలు ఆలస్యంగా చెన్నై నుంచి బయల్దేరింది. స్థానిక త్రిశూలంలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం తెల్లవారుజామున 1.40 గంటలకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం సింగపూర్‌కు ప్రయాణికులతో బయల్దేరాల్సి ఉంది. అయితే, ప్రయాణికులు ఎక్కే ముందు ఆ విమానంలో సాంకేతికలోపాన్ని గుర్తించిన పైలెట్ వెంటనే విమాన ఇంజనీర్ల బృందానికి తెలియజేశారు. అందువల్ల ఆ విమానంలో ప్రయాణించాల్సిన 186 మందిని విశ్రాంతి గదికి పంపించారు. ఇంజనీర్ల బృందం సాంకేతికలోపాన్ని సరిచేశాక, ఐదు గంటలు ఆలస్యంగా విమానం బయల్దేరింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూన్ 13: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పోరూర్: ఎల్కాన్, కాడువెట్టి, ఆవడిరోడ్డు కొంత భాగం, మేట్టు వీధి, అంబాళ్ నగర్, వాణియార్ వీధి, పూందమల్లి బైపాస్ రోడ్డు, ఎస్ఎస్ ఆలయ వీధి.

పల్లావరం: కడప్పేరి సంగం రోడ్డు, పొన్నియప్పర్ వీధి, అన్నాసాలై, స్కూల్ రోడ్డు వీధి, బర్గీస్ డాట్, ఎంజీఆర్ రోడ్డు, పిళ్లయార్ ఆలయ వీధి, రెట్టైమలై శ్రీనివాసన్ వీధి, మూవేందర్ నగర్, భజన ఆలయ వీధి, రంగస్వామి వీధి, అర్‌కిశ్వరర్ కాలని, మదువప్ప వీధి, వేళప్పర్ వీధి, తిరునీల్‌మలై మెయిన్ రోడ్డు, నాగలకేని. **షోలింగనల్లూర్:** ఎల్కాట్, సిరుచేరి, ఎల్కాట్ అవెన్యూ, క్లాసిక్ ఫామ్స్ 1 నుంచి 10 వీధులు, కుమారస్వామి నగర్, తాలంపూర్ విలేజ్, నత్తం విలేజ్, తాలంపూర్ రోడ్డు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాల విద్యార్థులకు కేటీవీ హెల్త్‌ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ (గుమ్మిడిపూండి) వారు గురువారం సుమారు రూ.3 లక్షల విలువ చేసే నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కమ్యూనిటీ సర్వీస్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఏఎన్ రాజశేఖర్ ముఖ్య అతిథిగా, బాలసుబ్రహ్మణ్యం విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అతిథుల చేతుల మీదుగా ఈ నోటు పుస్తకాల పంపిణీ జరిగింది.

పెరియమంధై చెరువులో చేపలవేట

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ సమీపంలోని తామరైపట్టి గ్రామం పెరియమంధై చెరువులో 20 యేళ్ల తర్వాత చేపలుపట్టే వేడుకలు గురువారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో దిండుగల్, వడమదురై, పెరియకోట్టై, ముళ్లిప్పాడి, శీలప్పాడి, వేడచందూరు తదితర గ్రామాలకు చెందిన చిన్నలు, పెద్దలు అంటూ సుమారు రెండు వందల మంది చేపలు పట్టే వలలు, వెదురు బుట్టలతో చెరువులో దిగి చేపలు పట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగిన ఈ చేపలవేటలో ఒకటిన్నర టన్నుల మేరకు చేపలు పట్టారు. జిలేబీ, కట్లా, రోగు, మీసైవిరా (కొరమీను) కెళుత్తి, సిల్వర్ కండై తదితర రకాలకు చెందిన చేపలు లభించడంతో గ్రామస్థులు సంతోషంతో ఇళ్ళకు చేరుకున్నారు.



చెరువులో చేపలుపడుతున్న గ్రామస్థులు

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరుతో రూ.4 కోట్ల మోసం

● ఇద్దరు మహిళల అరెస్ట్

పెరంబూర్, జూన్ 13: క్రిప్టో కరెన్సీలో సుమారు 300 మందిచే పెట్టుబడులు పెట్టించి సుమారు రూ.4 కోట్ల మోసానికి పాల్పడి ఏడాదికిపైగా అదృశ్యమైన ఇద్దరు మహిళలను బాధిత ప్రజలే బంధించి పోలీసులకు అప్పగించారు. లక్ష పెట్టుబడి పెడితే 15 నెలల ప్రతి నెలా రూ.15 వేలు అందించడంతోపాటు కాలపరిమితి ముగిసిన తర్వాత పూర్తి పెట్టుబడి తిరిగి అందజేస్తామని చిత్తిరైపేటకు చెందిన రెజీనాపేసి అనే మహిళ నగదు వసూలు చేసి పరారయ్యారు. ఈ నేపథ్యంలో, ఆమె పుదుచ్చేరిలోని ఓ బ్యాంక్‌కు వచ్చిందని తెలుసుకున్న బాధితులు అక్కడకు చేరుకొని రెజీనా, ఆమె కార్యాలయంలో పనిచేసే ఉద్యోగిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

కుమార్తెకు లైంగిక వేధింపులు

● పెంపుడు తండ్రికి 20 ఏళ్ల జైలు

పెరంబూర్, జూన్ 13: కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడిన పెంపుడు తండ్రికి కోర్టు 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. తిరుప్పూర్ సమీపం ఊత్తుకులి ప్రాంతంలో 30 ఏళ్ల మహిళ తన 14 ఏళ్ల కుమార్తెలో నివస్తోంది. ఆ మహిళ, 40 ఏళ్ల వయస్సున్న వ్యక్తిని రెండవ వివాహం చేసుకుంది. ముగ్గురు ఒకే ఇంట్లో ఉంటున్న సమయంలో, గత 2023లో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై తండ్రి కావాల్సిన వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తన అవ్వకు తెలియజేయడంతో ఆమె కాంగయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై పోక్సో కింద కేసు నమోదుచేసిన పోలీసులు, అతనిని అరెస్ట్ ఏసి జైలుకు తరలించారు. తిరుప్పూర్ మహిళా కోర్టులో ఈ కేసుకు సంబంధించిన వాదనలు ముగియడంతో, నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీధర్ బుధవారం తీర్పు వెలువరించారు.

కుటుంబ కలహాలతో భార్యాభర్తల ఆత్మహత్య

ప్యారీస్, జూన్ 13: స్థానిక ఆవడి ప్రాంతంలో కుటుంబ కలహాల కారణంగా భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఆవడి అన్నామలై నగర్‌కు చెందిన ప్రకాష్ (40), ఆయన భార్య సత్య (30)లకు దీపక్ అనే కుమారుడు, హరిణి అనే కుమార్తె ఉన్నారు. ఆవడి కూరగాయల మార్కెట్లో కూలిపనులు చేస్తున్న ప్రకాష్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడిన విషయం తెలిసి సత్య అతనితో గొడవ పడుతుంటారని తెలిసింది. ఈ నేపథ్యంలో, బుధవారం మధ్యాహ్నం మళ్లీ భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో, మనస్తాపానికి గురైన సత్య గదిలోకెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది చూసిన ప్రకాష్ కూడా ఇంటి హాలులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఇరుగుపొరుగు వారు అందించిన సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు, మృతదేహాలు స్వాధీనం చేసుకొని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అమిత్‌షా తీరును ఖండించిన కాంగ్రెస్ ఎంపీ

పెరంబూర్, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణీ స్వీకార సభలో బీజేపీ రాష్ట్ర నేత తమిళిసై సౌందర్‌రాజన్‌తో కేంద్ర మంత్రి అమిత్ షా వ్యవహరించిన తీరును కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ ఖండించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... అమిత్ షా మహిళా వ్యతిరేక మనస్తత్వానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. అమిత్‌షా మహిళలను గౌరవించరు, అందుకు బదులుగా అవమానిస్తారని పేర్కొన్నారు. ఓబీసీ మహిళలను అగౌరపరచడంలో బీజేపీ అసలు ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని కాంగ్రెస్ ఎంపీ పేర్కొన్నారు.

గడువుతీరిన 26 టోల్‌ప్లాజాలను మూసివేయాలి

అడయార్, జూన్ 13: రాష్ట్ర వ్యాప్తంగా గడువుతీరిన 26 టోల్‌ప్లాజాలను మూసివేయాలని తమిళనాడు ఇసుక లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు ఆర్.మునిరత్నం కోరారు. ఈ విషయంపై ఆయన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు ఒక లేఖ రాశారు. చెన్నై, కాంచీపురం, తిరువళ్ళూరు, చెంగల్పట్టు, వేలూరు, రాణిపేట, తిరువణ్ణామలై, విల్లుపురం, కడలూరు తదితర ప్రాంతాల్లో ఎంశాండ్, వాగులు, నదుల నుంచి సేకరించిన ఇసుకను చెన్నై నగరానికి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు టోల్‌ప్లాజా ఫీజు చెల్లించాల్సి ఉంది ఈ కారణంగా తమ వ్యాపారం బాగా దెబ్బతింటుంది. చిన్న, భారీ వాహనాలకు రోడ్ ట్యాక్స్‌ను తగ్గించాలి. ఇప్పటికే కేంద్రం అమలు చేస్తున్న జీఎస్టీ పన్నుతో తమపై అపారమైన భారం పడుతుంది. అందువల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గడువు తీరిన మొత్తం 26 టోల్‌ప్లాజాలను మూసివేయాలని సీఎంకు రత్నవేలు రాసిన లేఖలో పేర్కొన్నారు.

పెళ్లి పీటలపై వివాహాన్ని అడ్డుకున్న వధువు

అడయార్, జూన్ 13: సేలం జిల్లాలో ఓ నవ వధువు పెళ్లి పీటలపై వివాహాన్ని అడ్డుకుంది. ఈ చర్యతో వివాహానికి వచ్చిన అతిథులు, ఇరు కుటుంబ సభ్యులు ఒకింత షాక్‌కు గురయ్యారు. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, సేలం అళగాపురంకు చెందిన బీఈ పూర్తి చేసిన ఓ యువకుడికి అదే జిల్లాలోని ఓమలూరు ప్రాంతానికి చెందిన ఒక యువతితో వివాహం చేసేందుకు ఇరు కుటుంబాల పెద్దలు ఆరు నెలల క్రితం నిశ్చితార్థం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఏర్కాడు అడివారం ప్రాంతంలో ఉన్న మురుగన్ ఆలయంలో పెళ్లి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలకు ఈ వివాహం జరగాల్సి ఉంది. అయితే వరుడు తాళికట్టబోయే సమయంలో వరుడు తనకు నచ్చలేదని పేర్కొంటూ వధువు తాళిని లాక్కొని విసిరేసి పెళ్ళిని అడ్డుకుంది. దీంతో పెళ్ళికి వచ్చిన వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత ఇరు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో వారు ఇరు వర్గాల వారిని శాంతింపజేసి నచ్చజెప్పి పంపించారు.

కాళికాంబాళ్ ఆలయ పూజారి బెయిలు పిటిషన్ తోసివేత



పూజారి కార్తీక్ మునుసామి

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి వచ్చే యువతులకు తీర్థం పేరుతో మత్తుకలిపిన పానీయాలను ఇచ్చి లైంగిక వేధింపులకు పాల్పడి, వారిని అశ్లీలంగా ఫొటోలు తీసి అరెస్టయిన ప్యారీస్ కార్నర్ తంబుశెట్టి వీధిలోని సుప్రసిద్ధ కాళికాంబాళ్ ఆలయ పూజారి కార్తీక్ మునుసామి బెయిలు పిటిషన్ తోసివేతకు గురైంది. ఆ పూజారి మత్తుమందు కలిపిన పానీయం ఇచ్చి తనను పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడని సాలిగ్రామం ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు టీవీ ఛానెల్‌లో పనిచేస్తున్న యువతి చేసిన ఫిర్యాదు మేరకు విరుగంబాక్కం పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో కార్తీక్ మునుసామి తనను బెయిలుపై విడుదల చేయాలని కోరుతూ సిటీ ప్రిన్సిపల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ గురువారం విచారణకు రాగా ప్రభుత్వ తరఫు న్యాయవాది దేవరాజన్ వాదిస్తూ పూజారి కార్తీక్ మునుసామి యువతులతో అసభ్యంగా ప్రవర్తించాడని, ప్రైవేట్ టీవీ సంస్థ మహిళా ఉద్యోగిపై అత్యాచారం జరుపటమే కాకుండా ఆమెను పలువురు వీఐపీలతో పడక సుఖం అనుభవించమంటూ బెదరించాడని, తన మాట వినకపోతే ఆమె అశ్లీలవీడియోలు, ఫొటోలు విడుదల చేస్తానని కూడా బెదిరించాడని ఆరోపించారు. పోలీసులు జరిపిన విచారణలో పూజారి కార్తీక్ మునుసామి సుమారు 25 యువతులను మాయమాటలతో మోసగించి వారితో ఉల్లాసంగా గడిపినట్లు కనుగొన్నారని, వాటికి సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారని, ఈ పరిస్థితులలో బెయిలు మంజూరు చేస్తే విదేశాలకు పారిపోతాడని వాదించారు. పూజారి తరఫు న్యాయవాది వాదిస్తూ న్యాయస్థానం విధించే అన్ని షరతులను పాటించేందుకు సిద్ధంగా ఉన్నామని, కనుక బెయిలు మంజూరు చేయాలని కోరారు. ఇరుపక్షాల వాద ప్రతివాదనల అనంతరం మేజిస్ట్రేట్ అల్లీ బెయిలు పిటిషన్‌ను తోసిపుచ్చుతూ తాను నిర్వర్తించాల్సిన పవిత్ర బాధ్యతలకు భంగం కలిగించే రీతిలో పూజారి కార్తీక్ మునుసామి ప్రవర్తించడం క్షమించరాని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెయిలు పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నామని మేజిస్ట్రేట్ అల్లీ ప్రకటించారు.



'ఒత్త ఓటు ముత్తయ్య'లో గౌండమణి, యోగిబాబు

ఎన్నికల్లో గౌండమణి - యోగిబాబు పోటీ...

ఎవరు గెలిచారు?

సీనియర్ హాస్య నటుడు గౌండమణి హీరోగా నటించిన చిత్రం 'ఒత్త ఓటు ముత్తయ్య'. ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు ఒక కీలక పాత్ర పోషించారు. రవిమారియ, రాజేంద్రన్, వయ్యాపురి, సింగముత్తు, వాసన్ కార్తీక్, సీనియర్ హాస్య నటుడు దివంగత నగేష్ మనవడు గజేష్, రాజేశ్వరి తదితరులు నటించారు. రాజకీయ సెటైర్ల నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీకి రాజ్ గోపాల్ దర్శకత్వం వహించారు. ఈయన గతంలో 'సుందరి నీయుం సుందరన్ నానుం', 'కిచ్చా వయసు 16' వంటి చిత్రాలను తెరకెక్కించారు. సుమారుగా 70కు పైగా చిత్రాల్లో గౌండమణి - సెంథిల్‌కు కామెడీ ట్రాక్‌లు అందించారు. సినీ క్రాఫ్ట్ పతాకంపై రవిరాజా నిర్మించగా, సిద్ధార్థ్ విపిన్ సంగీతం అందించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్‌పై పదవీ ప్రమాణ స్వీకారోత్సవంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు అని పొందుపరిచారు. ఒక రాజకీయ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గౌండమణి ఒక్క ఓటు తేడాతో విజయం సాధిస్తారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన యోగిబాబు... గౌండమణిని ఓడించారా? లేదా? అన్నదే చిత్ర కథ. ఈ స్క్రిప్టును పూర్తి హాస్యభరితంగా, పొలిటికల్ సెటైరికల్‌గా తెరకెక్కించారు.



'నన్బన్ ఒరువన్ వంద పిరగు' ఓ దృశ్యం

స్నేహానికి ప్రాధాన్యతనిచ్చే

'నన్బన్ ఒరువన్ వంద పిరగు'

కొత్త దర్శకుడు అనంత్ స్నేహానికి ప్రాధాన్యతనిస్తూ 'నన్బన్ ఒరువన్ వంద పిరగు' అనే పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కించారు. జీవితంలోని మధురస్మృతులను జ్ఞప్తికి తెచ్చేలా ఈ సినిమా రూపొందించినట్టు దర్శకుడు తెలిపారు. ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు సమర్పణలో వైట్ ఫెదర్ స్టూడియోస్, మసాలా పాప్‌కాన్ అనే నిర్మాణ సంస్థలు సంయుక్తంగా తెరకెక్కించాయి. లీల, కుమారవేల్, విశాలి, ఐశ్వర్య.ఎం, అనంత్, భవానీ శ్రీ, ఆర్జే విజయ్, ఇర్ఫాన్, విల్‌స్పాట్, పూర్ణేష్, కేపీవై బాల, మోనిక, ఆర్జే ఆనంది, శబరీష్, గుహన్, ధర్శ, వినోద్ తదితరులు నటించారు. తమిళ్ సెల్వన్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి ఏహెచ్.ఖాషిఫ్ సంగీతం సమకూర్చారు. ఇందులో ప్రధాన హీరోగా నటించిన అనంత్ చిత్రానికి కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. ఈ మూవీ గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'జీవితంలో వృద్ధిలోకి వచ్చేందుకు ఒక వ్యక్తి తన స్నేహితులకు ఏ విధంగా సాయపడ్డారనే కథాంశంతో రూపొందించాం. ఫ్రెండ్‌షిప్‌కు ప్రాధాన్యత ఇచ్చాం. స్నేహం, ఫ్యామిలీ, సెంటిమెంట్, లవ్, కామెడీ ఇలా అన్ని అంశాల మేళవింపుతో రూపొందించాం. ప్రతి ఒక్కరి జీవితాల్లో చోటుచేసుకున్న వాస్తవిక అంశాల చుట్టూతనే ఈ మూవీ స్క్రీన్‌ప్లే సాగుతుంది. ఈ సినిమా చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ... ఇందులో చూపించిన ఆ సీన్ వంటిదే మన జీవితంలో కూడా జరిగింది కదా అని అనుకుంటారు. ఖచ్చితంగా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుందన్న నమ్మకం ఉంది' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రంలో ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందించిన 'ముస్తాఫా.. ముస్తాఫా' పాటను ఉపయోగించాం. ఇందుకోసం ఆ పాట సొంతమైన ఆడియో కంపెనీ నుంచి రైట్స్ తీసుకుని ఉపయోగించినట్టు ఓ ప్రశ్నకు దర్శకహీరో అనంత్ సమాధానమిచ్చారు.

హీరోయిన్‌గా దర్శకుడి కుమార్తె !



హాజల్ షైనీ

కోలీవుడ్ దర్శకుడు ప్రభు సాల్మన్ పలు హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించారు. గత కొంతకాలంగా సరైన హిట్ లేకపోవడంతో చిత్ర పరిశ్రమకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తన కుమార్తె హాజల్ షైనీని వెండితెరపై హీరోయిన్‌గా పరిచయం చేయనున్నారు. ఈ సినిమాలో ప్రముఖ నటి వనిత కుమారుడు శ్రీహరి హీరోగా నటించనున్నారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అడవిలో జరిగే ప్రేమకథగా రూపొందించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కోసం షైనీ, శ్రీహరి కలిసి ప్రభు సాల్మన్ ఆఫీసులో రిహార్సల్ చేస్తున్నారు. కాగా, షైనీ సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. ఆమె ఇన్‌స్టా ఖాతాను వేలాది మంది ఫాలోయర్స్ ఉండటంతో బాగా పాపులర్ అయ్యారు.

రజినీ 'కూలి' షూటింగ్ వాయిదా?

చిత్రజ్యోతి

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న మూవీ 'కూలీ'. సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడు. ఈ సినిమా షూటింగ్ ఈ నెల 10వ తేదీ ప్రారంభించేలా ప్లాన్ చేశారు. కానీ స్క్రిప్టుతో పాటు ఇతర ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ఈ ప్రాజెక్టును సెట్స్‌పైకి తీసుకెళ్ళడంలో జాప్యం జరిగినట్టు సమాచారం. అదేసమయంలో ఈ నెలాఖరు లేదా జూలై మొదటి వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించే ఈ చిత్రంలో ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. సూపర్‌స్టార్ రజినీ నటించే 171వ చిత్రం. ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ సన్ పిక్చర్స్ బ్యానరుపై నిర్మిస్తున్నారు.



'కూలి'లో రజినీకాంత్

సందడిగా సాగిన మ్యాంగో ఫెస్టివల్



మామిడి పండ్లతో తయారైన తినుబండారాలను సందర్శకులకు అందజేస్తున్న హనురెడ్డి

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతంలోని హను రెడ్డి రాఘవ ఫామ్స్‌లో మ్యాంగో ఫెస్టివల్ అత్యంత వైభవంగా జరిగింది. ప్రజలకు మామిడి పండ్ల పెంపకం, వాటి రుచులు, రకాలు తెలుసుకునేందుకు వీలుగా ఈ వేడుకలను దేశవ్యాప్తంగా మ్యాంగో టూరిజం పేరుతో అవగాహన ప్రచారం చేస్తున్న హను రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ వేడుకలలో నగర ప్రముఖులు, వ్యాపారులు, యువతీ యువకులు, కోలీవుడ్ నటీనటులు పాల్గొని సందడి చేశారు. తమ విస్తారమైన మామిడి తోటల నడుమ 155 అడుగుల పొడవు కలిగిన వలయాకారపు టేబుల్‌ను ఏర్పాటు చేసి నగరంలోని ప్రముఖులు, నటీనటులు, కళాకారులకు మామిడిపండ్లతో తయారు చేసిన వివిధ రకాల పానీయాలు, కేక్‌లను ఆయన పంపిణీ చేశారు. మామిడితో తయారైన ఆ తినుబండారాలను వేడుకలకు హాజరైనవారంతా చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఆరగించారు. ఈ సందర్భంగా హనురెడ్డి మాట్లాడుతూ జపాన్ వంటి విదేశాలలో చెర్రీ బ్లూసమ్ ఫెస్టివల్ నడుపుతున్నట్లే మామిడి పండ్ల విశిష్టతలను భావితరాలకు అందించే నిమిత్తం తాను మ్యాంగో ఫెస్టివల్‌ను ప్రతియేటా జరుపుతున్నానని వివరించారు.

16న శ్రీనివాస తిరుకల్యాణ మహోత్సవం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న పద్మరాజ్, ఐశ్వర్య తదితరులు

ప్యారీస్, జూన్ 13: నగరంలోని శ్రీవెంకటాద్రి భజన సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేది శ్రీనివాస తిరుకల్యాణ మహోత్సవం జరుగనుంది. స్థానిక మాధవరం బస్ టెర్మినల్ సమీపంలోని రెట్టేరి ఆర్టీఓ కార్యాలయం జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులో ఉన్న ఉమియ మహల్‌లో 15,16 తేదీల్లో నిర్వహించనున్న వేడుకల ఆహ్వాన పత్రిక, పోస్టర్, ఫ్లెక్సీలను గురువారం ఆవిష్కరించారు. పొన్నియమ్మన్‌మేడు మోహన్ నగర్‌లో ఉన్న శ్రీ వెంకటాద్రి భజన సమాజం కార్యాలయంలో ప్రత్యేక పూజల అనంతరం నిర్వాహకులు కె.పద్మరాజ్, కె.ఐశ్వర్యలు వీటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీమాన్ భక్త పార్థసారధి రామానుజర్ ఆశీస్సులతో లోక సంక్షేమార్థం శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 15వ తేది సాయంత్రం 7 గంటలకు గరుడ వాహన సేవ, శ్రీజన్మరక్షక హరినామ సంకీర్తనం, 16వ తేది ఉదయం 10 నుంచి 12 గంటల్లోపు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి, త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వాముల పర్యవేక్షణలో కాశి యాత్ర, మాల మార్పిడి, మహా సంకల్పం, మాంగల్యధారణ జరుగుతుందని తెలిపారు. భక్తులందరూ పాల్గొని దైవాశీస్సులు పొందాలని వారు పిలుపునిచ్చారు.

శాశ్వత కేఫ్ ప్రారంభం



కేఫ్ నిర్వాహకులతో సినీ నటి స్నేహ

అడయార్, జూన్ 13: స్థానిక ఆళ్వార్‌పేట, చామియర్స్ రోడ్డులో శాశ్వత పేరుతో నెలకొల్పిన కేఫ్‌ను ప్రముఖ సినీ నటి స్నేహ కేఫ్ నిర్వాహకులు అనిత శివకుమార్, శివానీ శివకుమార్‌లతో కలిసి తాజాగా ప్రారంభించారు. దక్షిణ భారత పాక వారసత్వం, ఆధునిక భోజన దృశ్యానికి ప్రామాణికమైన ఉడిపి రుచులు, సంప్రదాయం వంటకాలను అందుబాటులో ఉంచింది. సాంబార్, బెన్నె దోస వంటి క్లాసిక్ ఫేవరెట్‌ల నుంచి వినూత్న వంటకాలను ఉన్నాయి. 'ఫ్లేవర్స్ అక్రాస ది బోర్డర్స్' అనే పేరుతో సంప్రదాయ దక్షిణ భారత పాక పద్ధతులతో వైవిధ్యభరితమైన రుచులతో తయారు చేసిన వంటకాలు ఈ కేఫ్‌లో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పగడపు మేని వర్ణంతో

ఆధ్యాత్మికం

'పవళవణ్ణ పెరుమాళ్'

గృహ, గ్రహదోషాలు తొలగించే 'సత్యక్షేత్రం'

శైవ, వైష్ణవ ఆలయాలు మెండుగా కలిగిన అరుదైన క్షేత్రంగా కాంచీపురం విరాజిల్లుతోంది. ఆ నగరంలో సుప్రసిద్ధ అత్తివరదరాజ పెరుమాళ్ ఆలయానికి ధీటుగా పగడపు వర్ణ మేనిఛాయ కలిగిన పెరుమాళ్ కొలువుదీరిన వైష్ణవ దివ్య క్షేత్రం కూడా ఉంది. ఈ ఆలయం అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాలలో 55వ దివ్యదేశంగా కీర్తిగడించింది. తిరుమంగై ఆళ్వారు తిరునెడుంతాండకమ్ 9వ పాశురంలో ఈ క్షేత్రమహిమలపై మంగళాశాసనమొనర్చారు. మహావిష్ణువు కృతయుగంలో శ్వేత వర్ణంతోనూ, త్రేతాయుగంలో పగడపు వర్ణంతోనూ, ద్వాపరయుగంలో ఆకుపచ్చ వర్ణంతోనూ దర్శనమిచ్చారు., కలియుగంలో నీలి వర్ణంతో భక్తులను అనుగ్రహిస్తున్నారు. మహావిష్ణువుకు పగడపు వర్ణాన్ని పరమేశ్వరుడే ప్రసాదించాడని పౌరాణిక గాథలు చెబుతున్నాయి. ఇంతటి విశేషాలు కలిగిన మహావిష్ణువు కాంచీపురంలో 'పవళవణ్ణ పెరుమాళ్'గా భక్తకోటికి దర్శనమిస్తున్నారు. ఈ ఆలయంలో పగడపు వర్ణంతో, ఆకుపచ్చ వర్ణంతోనూ స్వామివారు రెండు వేర్వేరు సన్నిధులలో కొలువుదీరి భక్తులకు కనువిందు చేయటం మరీ విశేషం.

- ఆంధ్రజ్యోతి, చెన్నై



ఆలయ అంతర ప్రాకారం



'పవళవణ్ణ పెరుమాళ్'



శ్రీదేవి, భూదేవి సమేత ప్రవాళవణ్ణ పెరుమాళ్



బ్రహ్మోత్సవ వైభవంలో ఇష్టదేవేరులతో స్వామివారు



అద్దాలమండపంలో పవళవళ్ళి

స్థలపురాణం...

పూర్వం మహావిష్ణువు, బ్రహ్మదేవుడు తమ ఇరువురిలో ఎవరు గొప్ప అనే విషయమై తగాదాపడ్డారు. ఈ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ఇరువురూ పరమేశ్వరుడిని ఆశ్రయించారు. తన ఆది, అంతాలను దర్శించినవారినే గొప్పవారని ప్రకటిస్తానని పరమేశ్వరుడు తెలిపారు. ఆ మేరకు మహావిష్ణువు, బ్రహ్మదేవుడు పరమేశ్వరుడి ఆది అంతాలను దర్శించేందుకు సిద్ధమయ్యారు. మహావిష్ణువు ఎంత ప్రయత్నించినా పరమేశ్వరుడి శిరోభాగాన్ని, పాదకమలాలను చూడలేకపోయారు. ఆ విషయాన్ని పరమేశ్వరుడి తెలిపాడు. అయితే బ్రహ్మదేవుడు తాను ఈశ్వరుడి జటాముడిని దర్శించానని చెబుతూ, సాక్ష్యంగా మొగలి పూవును వెంటబెట్టుకుని వచ్చారు. బ్రహదేవుడు అసత్యం పలుకడంతో భూలోకంలో బ్రహ్మదేవుడికి ఆలయాలు లేకుండా భక్తులెవరూ ఆయనను ఆరాధించని విధంగా పరమేశ్వరుడు శాపమిస్తారు. శివుడి శాపవిముక్తి కోసం బ్రహ్మదేవుడు తన సతీమణి సరస్వతీదేవి లేకుండా యాగం చేయడానికి సిద్ధమవుతారు. ఆ విషయం తెలుసుకున్న సరస్వతీదేవి ఆ యాగాన్ని విధ్వంసం చేయడానికి భూతగణాలను, రాక్షసులను పురమాయిస్తుంది. బ్రహ్మదేవుడు భయపడి మహావిష్ణువును ఆశ్రయించి తనను కాపాడమని వేడుకుంటారు. మహావిష్ణువు సరస్వతీదేవి పంపిన రాక్షసులందరినీ సంహరిస్తారు. ఆ సమయంలో అసురుల రక్తం మహావిష్ణువు దేహంపై పడి ఆయన మేని ఛాయ పగడపు వర్ణంగా మారుతుంది. ఆ పౌరాణిక గాథకు సాక్ష్యంగా ఈ ఆలయంలోని స్వామివారు 'పవళవణ్ణ పెరుమాళ్'గా కీర్తింపబడుతున్నారు. ఈ స్వామివారికి ప్రవాళవణ్ణర్ అనే పేరు కూడా ఉంది. లక్ష్మీదేవి కోరిక మేరకు మహావిష్ణువు ఆకుపచ్చ వర్ణంలో ఉన్న తన దేహాన్ని పసుపు వర్ణంగా మార్చుకోవాలని పరమేశ్వరుడిని ఆరాధిస్తూ తపమాచరించాలని నిర్ణయించారు. ఆ మేరకు భూలోకం చేరుకుని చక్రాయుధంతో తీర్థకొలనును నిర్మించి, అందులో రోజూ స్నానమాచరించి పరమేశ్వరుడిని ప్రార్థిస్తూ తపస్సు చేశారు. ఆ తపస్సును మెచ్చి పరమేశ్వరుడు మహావిష్ణువు మేని రంగును పసుపువర్ణంలోకి మార్చారు. ఇదే విధంగా వైకుంఠంలో లక్ష్మీదేవి సమేతుడైన మహావిష్ణువును కాలితో తన్నిన పాపాన్ని ప్రక్షాళనం చేసుకునేందుకు భృగుమహర్షి నారద మహర్షి సూచన ప్రకారం సత్యక్షేత్రంగా పిలిచే పవళవణ్ణపెరుమాళ్ క్షేత్రంలో తపస్సు చేసి పాపవిముక్తి పొందారు. ఈ సంఘటనను గుర్తుచేసేలా ఈ క్షేత్రంలోని గర్భాలయంలో పెరుమాళ్‌ను ఆరాధిస్తున్న భంగిమలో భృగుమహర్షి విగ్రహం కూడా ప్రతిష్ఠించి ఉంది.


ఆలయ వైభవం...

స్వామివారి నామధేయం : పవళవణ్ణర్
తాయార్ నామధేయం : పవళవళ్ళి (ప్రవాళవళ్ళి)
తీర్థం : చక్రతీర్థం, ఆగమం : పాంచరాత్రం
విమానం : ప్రవాళ విమానం

ఈ ఆలయంలో పవళవణ్ణర్, పచ్చై వణ్ణర్ అంటూ స్వామివారు ఎదురెదురుగా రెండు సన్నిధులలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ రెండు సన్నిధులను కలిపే ఒకే దివ్యదేశంగా భక్తులు ఆరాధిస్తున్నారు. ఐదంతస్థులతో కూడి రాజగోపురం కలిగిన ఆలయంలో ప్రవాళవిమానం దిగువన మూలవర్లు పవళవణ్ణర్ ఆశీన భంగిమలో పశ్చిమాభిముఖుడై దర్శనమిస్తున్నారు. తయార్ పవళవళ్ళి ప్రత్యేక సన్నిధిలో నాచ్చియార్‌గా కనువిందు చేస్తున్నారు. పెరుమాళ్ సమీపంలో సంతాన గోపాలకృష్ణన్ కూడా ఉన్నారు. ఇక్కడి ప్రవాళవల్లి అమ్మవారి సన్నిధి ముఖ మండపం పైకప్పులో అష్టదిక్పాలకుల విగ్రహాలు ఉన్నాయి. వీరిని దర్శించి మొక్కితే లక్ష్మీకటాక్షం లభిస్తుందని, గృహ, గ్రహదోషాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంగా ఉంటోంది. ఆండాళ్, తిరుమంగై ఆళ్వారు, నమ్మాళ్వారు, ఉడయవర్, పన్నిరు ఆళ్వార్లు, మనవాళమహాముని సన్నిధులు కూడా ఉన్నాయి. ఆలయానికి ముదు భాగాన చక్రతీర్థం ఉంది. వలయాకారంలో చక్రాయుధంలా కనిపించే ఈ తీర్థం నడుమ నిలిచి మహావిష్ణువు అసురులను వధించినట్లు స్థలపురాణం చెబుతుంది. ఈ ఆలయం అత్యంత ప్రాచీనమైనదని, వెయ్యేళ్ల నాటిదని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు.

ఆలయ ఉత్సవాలు...

మార్గశిర మాసంలో, వైకుంఠ ఏకాదశి, పంగుణి మాసంలో ఐదు రోజుల పవిత్రోత్సవం, వైయ్యాశి మాసంలో పది రోజుల బ్రహ్మోత్సవాలు, అత్యంత వైభవంగా జరుగుతాయి. రాహు-కేతు దోషాలతో బాధపడేవారు ఈ స్వామివారిని దర్శిస్తే దోష రహితులవుతారు. పవళవణ్ణపెరుమాళ్ తనను ఆరాధించే భక్తులకు వివాహయోగం, పుత్రభాగ్యాలను కల్పిస్తున్నారు.





ఆలయ రాజగోపురం - ఆలయ బలిపీఠం

ఎలా వెళ్లాలి? : రాష్ట్రంలోని పలు నగరాల నుంచి కాంచీపురానికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. బస్టాండులో దిగి రైల్వేస్టేషన్ దాకా నడచుకుంటూ వెళితే ఈ ఆలయాన్ని చేరుకోవచ్చు.. చెన్నై నుండి కాంచీపురం వెళ్లేందుకు రైళ్లు కూడా ఉన్నాయి. కాంచీపురం రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో పవళవణ్ణపెరుమాళ్ ఆలయాన్ని దర్శించవచ్చు. రోజూ ఉదయం 8 నుండి 11 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 7.30 గంటల వరకు ఆలయాన్ని తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



చక్రతీర్థం

అనుమానాస్పద స్థితిలో

'తెగిడి' నటుడు ప్రదీప్ మృతి



ప్రదీప్ కె.విజయన్ (ఫైల్‌ఫొటో)

అడయార్, జూన్ 13: కోలీవుడ్‌లో విషాదం నెలకొంది. 'తెగిడి' నటుడు ప్రదీప్ కె.విజయన్ తన నివాసంలోనే అనుమానాస్పదంగా మృతి చెందాడు. చెన్నై పాలక్కంలోని స్వగృహంలోనే విగతజీవిగా కనిపించడాన్ని అతని ఇంటికి వెళ్ళిన ఓ మిత్రుడు గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశాడు. దీంతో పోలీసులు ప్రదీప్ నివాసానికి వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితమే చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. శవపరీక్ష నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొద్దిరోజుల క్రితం శ్వాసపీల్చడంలో ప్రదీప్ ఇబ్బందులకు గురయ్యాడని స్నేహితుడు పోలీసులకు తెలిపాడు. ప్రదీప్ మృతిపై పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలుపుతూ ట్వీట్స్ చేశారు. కాగా, గత 2013లో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ప్రదీప్... 'తెగిడి' చిత్రంతో పాపులర్ అయ్యారు. ఆ తర్వాత 'టెడ్డీ' 'హే సినామిక' వంటి చిత్రాలతో ఇటు తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా, తెలుగు ప్రేక్షకులకు సైతం పరిచయమయ్యాడు. చివరిసారిగా రాఘవ లారెన్స్ నటించిన 'రుద్రన్' చిత్రంలో ప్రదీప్ నటించారు. అలాగే, విజయ్ సేతుపతి నటించిన 'మహారాజ' చిత్రంలో ఓ క్యారెక్టర్‌లో నటించగా, ఈ చిత్రం నేడు విడుదలకానుంది.

అట్టహాసంగా ఆణి మాసోత్సవాలు ప్రారంభం

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలోని సుప్రసిద్ధ శైవాలయంగా పేరుగడించిన నెల్లయప్పర్, కాంతిమది అంబాళ్ ఆలయంలో ఆణి మాస బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం స్వర్ణపల్లకీలో అస్త్రదేవర్ ఊరేగింపుగా బయలుదేరి అంగూరు వినాయకుడి ఆలయం వద్ద పిడికిట మన్నును ఆలయానికి తీసుకువచ్చి అంకురార్పణ చేశారు. బుధవారం సాయంత్రం ఆలయ ధ్వజాన్ని రథంపై వీధులలో ఊరేగించారు. గురువారం వేకువజాము మూడు గంటలకు ఆలయాన్ని తెరిచారు. స్వామివారి విశ్వరూప దర్శనం, ఉదయం శాంతి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత నెల్లయప్పర్‌స్వామి, కాంతిమది అంబాళ్ సర్వాలంకరణ శోభితులైన ధ్వజస్తంభ మండపంలో వేంచేసి వేలాదిమంది భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత ధ్వజస్తంభానికి 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. చివరగా ప్రధాన అర్చకులు ధ్వజారోహణం నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన ఆసియా ఖండంలోనే అధిక బరువు కలిగిన ఆలయ మహారథోత్సవం ఈ నెల 21న జరుగనుంది.



ధ్వజస్తంభానికి మహాదీపారాధన చేస్తున్న ఆలయ పూజారి